క్లుప్తంగా

వైభవంగా కొడీపీర్ల సరిగెత్తు



హుస్సేన్ హుస్సేన్ చావిడిలో కొలువుదీరిన పీర్లు

రాయదుర్గం టౌన్: కొడీ పీర్ల (చిన్న మొహ ర్రం) వేడుకల్లో భాగంగా పట్ట ణంలోని వివిధ ప్రాంతాల్లో కొలువుదీరిన చావిడిల్లో 7వ రోజు శనివారం సరిగెత్తు వేడుకలు నిర్వహించారు. సోమవారం పెద్ద సరిగెత్తు, పానకాల సమర్పణ, మంగళవారం పీర్ల ఊరేగింపు, జలధి ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

కుందుర్పి: మండలంలోని కెంచంపల్లి, బసాపురం, తూముకుంట, కరిగానిపల్లి తదితర గ్రామాల్లో శనివారం మొహర్రం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పెద్ద సరిగెత్తు సందర్భంగా భక్తులు పానకం కడవలతో వెళ్లి పీర్లను దర్శించుకున్నారు.ఆదివారం జలధితో మొహర్రం ఉత్సవాలు ముగుస్తాయి.

గృహ ప్రవేశాలు పండగలా సాగాలి



లబ్ధిదారులతో మాట్లాడుతున్న హౌసింగ్ డీఈ హనుమప్ప

కూడేరు: ఈ నెల 18న నిర్వహించే సామూహిక గృహ ప్రవేశ కార్యక్రమాన్ని పండగ వాతావరణంలో లబ్ధిదారులు జరుపుకునేలా చూడాలని హౌసింగ్ డీఈ హనుమప్ప సిబ్బందికి సూచించారు. శనివారం ఆయన కూడేరులో ఉన్న రెండు జగనన్న కాలనీల్లో పర్యటించారు. ఈసందర్భంగా ఆయన లబ్ధిదారులతో సమావేశమయ్యారు. ఇళ్ల ఇర్మాణాలు పూర్తి కావచ్చిన వారు 18వ తేదీకి పూర్తి చేసుకుని సొంతింటి కలను సాకారం చేసుకోవాలని సూచించారు. మిలిగిన వారు తొందరగా నిర్మాణాలు చేపట్టాలని, వెంటనే బిల్లులు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎంకే బాషా, ఏఈ శేఖర్, వర్క్ ఇన్‌స్పెక్టర్ అశోక్, ఇంజినీరింగ్ అసిస్టెంట్ హరి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఏడు శనివారాల వ్రతం



హారతి ఇస్తున్న భక్తులు

కళ్యాణదుర్గం రూరల్: పట్టణంలోని లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఏడు శనివారాల వ్రతం, పూజ భక్తులు శనివారం ఘనంగా నిర్వహించారు. కమిటీ సభ్యులు మాట్లాడుతూ సెప్టెంబర్ 9 వరకూ ప్రతి శనివారం వరకూ వ్రతం నిర్వహిస్తామని, భక్తులు హాజరు కావాలన్నారు. వ్రతం అనంతరం మహిళలు స్వామికి హారతి ఇచ్చారు.

కలుషిత ఆహారంపై విచారణ

రాయదుర్గం(డీహీరేహాళ్): డి హీరేహాళ్ కస్తూర్బా గురుకుల బాలికల పాఠశాల (కేజీబీవీ)లో రెండు రోజుల క్రితం కలుషిత ఆహారం తిని కొంత మంది విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారు. ఆరో తరగతికి చెందిన ఇద్దరు విద్యార్థినులు ఆస్పత్రిలో చికిత్స పొందారు. ఈ విషయం రెండు రోజుల తర్వాత ఆలస్యంగా సోషల్ మీడియాలో వైరల్ కాబడింది. దీన్ని సమగ్ర శిక్ష రాష్ట్ర, జిల్లా ఉన్నతాధికారులు సీరియస్‌గా పరిగణించారు. వారి ఆదేశాల మేరకు జిల్లా జీసీడీఓ వాణీదేవి శనివారం పాఠశాలలో విచారన చేపట్టారు.

ప్రమాదాల నివారణకు కృషి

బొమ్మనహాళ్: ప్రమాదాలను అరికట్టడానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఎస్‌ఐ శివ సూచించారు. శనివారం మండలంలోని ఉద్దేహాళ్ శివారులోని వేదావతి హగరి నది వద్ద ఆయన వాహనాలను తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ డ్రైవర్లు లైసెన్స్‌లు, వాహనాలకు సంబంధించిన రికార్డులు కలిగి ఉండాలన్నారు. ఈ సందర్భంగా 46 మందికి జరిమానా విధించామన్నారు. పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

గజగౌరీదేవి గ్రామోత్సవం



అమ్మవారి గ్రామోత్సవం నిర్వహిస్తున్న ఆర్యవైశ్యులు

బెళుగుప్ప: మండల కేంద్రంలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో రెండు రోజులుగా గజగౌరీదేవి వ్రత పూజలను ఘనంగా నిర్వహించి, వెండి రథంపై శనివారం గ్రామోత్సవం నిర్వహించారు. గజగౌరిదేవి విగ్రహాన్ని వెండి రథంపై ప్రత్యేక పూలు, రంగురంగుల విద్యుత్‌దీపాలతో అలంకరించి మంగళవాయిద్యాల మధ్య ఆర్యవైశ్య మహిళలు కళశాలను మోస్తూ ముందుకు సాగారు. అనంతరం అమ్మవారి ప్రతిరూపాలను స్థానిక చెరువులో నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో మండల ఆర్య వైశ్య సంఘం సభ్యులు, యువజన, మహిళా సంఘ సభ్యులు పాల్గొన్నారు.

రాజకీయ లబ్ధి కోసమే 'బాబు' కుట్ర

- పక్కా ప్లాన్‌తోనే మారణాయుధాలతో దాడులు
- కుప్పం పీఠం కదులుతుందనే భయంతోనే అల్లర్లకు ఆజ్యం
- పుంగనూరు ఘటనలో చంద్రబాబే మొదటి ముద్దాయి



రాయదుర్గం: వినాయక సర్కిల్‌లో బాబు దిష్టిబొమ్మ దహనం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



ఉరవకొండ: అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

రాయదుర్గం: రాజకీయ లబ్ధి కోసం ప్రశాంతంగా ఉండే ప్రజల మధ్య అల్లకల్లోలం సృష్టించి రాష్ట్రాన్ని రావణ కాష్టంగా మార్చాలన్నదే టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు కుట్ర అని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మాధవరెడ్డి, ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ ఇల్లురి శ్రీనివాసులు, ఎస్సీసెల్ రాష్ట్ర కార్యదర్శి బీటీపీ గోవిందు, వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ ముస్తాక్ విమర్శించారు. చిత్తూరు జిల్లా పుంగనూరులో టీడీపీ నాయకులు సృష్టించిన విధ్వంస కాండను వ్యతిరేకిస్తూ పట్టణంలోని వినాయక సర్కిల్ వద్ద మున్సిపల్ వైస్ చైర్మన్లు శ్రీనివాస్‌యాదవ్, వలీబాషా, కౌన్సిలర్లు, ముఖ్య నాయకులతో కలసి వారు శనివారం నిరసన వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ చంద్రబాబు రోడ్‌షోకు పుంగనూరు లో ఎలాంటి అనుమతులు లేకపోయినా ముందే రచించిన ప్లాన్ మేరకు టీడీపీ గుండాలు, రౌడీలతో వెళ్లి విధ్వంసానికి కారకుడయ్యాడన్నారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని నేరుగా ఎదుర్కొనే దమ్ములేక బాబు తెరచాటుగా దొంగ దెబ్బతీసేలా కుట్రలు పన్నాడని ధ్వజమెత్తారు. రక్షణగా నిలిచిన పోలీసులపై పచ్చ నాయకులు, రౌడీ మూకలను ఉసిగొల్పి రాళ్ల వర్షం కురిపిస్తూ భయానక వాతావరణం సృష్టించాడన్నారు. రాక్షసుడిలా వ్యవహరిస్తూ ప్రజలను భయంభ్రాంతులకు గురిచేశాడన్నారు. కుప్పం పీఠాన్ని పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కదిలిస్తాడనే భయంతోనే పుంగనూరులో దాడులకు తెగబడ్డాడని వారు ధ్వజమెత్తారు. ఈ ఘటనలో చంద్రబాబును మొదటి ముద్దాయిని చేసి జైలుకు పంపాలని డిమాండ్ చేశారు. అనంతరం వినాయక సరిల్ వద్ద పార్టీ శ్రేణుల ఆధ్వర్యంలో చంద్రబాబు దిష్టిబొమ్మకు నిప్పుపెట్టి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు పైతోట సంజీవ, పొరాళ్ల గోవిందరాజులు, డిష్ గోవిందు, శ్రీనివాసరెడ్డి, ఐనాపురం మంజు, వన్నూర్‌స్వామి, కోఆప్షన్ సభ్యులు, మార్కెట్‌యార్డ్ వైస్ చైర్మెన్ మేకల శ్రీనివాసులు, పార్టీ నాయకులు గోల్డ్ ఇస్మాయిల్, భీమనపల్లి దివాకర్, గుమ్మఘట్ట గోల్డ్ ఘని, జీ సత్యనారాయణ, కేఎమ్ రాజు, టీ శివశంకర్, వాల్మీకి పవన్, అజ్జప్ప, వైజాగ్ రవి తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుకు మంచి బుద్ధి ప్రసాదించాలి

ఉరవకొండ: సాగునీటి ప్రాజెక్టుల విధ్వంసంపై యుద్ధభేరి పేరుతో టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు పుంగనూరులో తలపెట్టిన రోడ్‌షోలో పచ్చమూక సృష్టించిన విధ్వంసాన్ని నిరసిస్తూ శనివారం ఉరవకొండలో వైఎస్సార్‌సీపీ నాయకులు ర్యాలీ చేపట్టారు. స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహం నుంచి టీడీపీకి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ముందుకుసాగారు. చంద్రబాబుకు మంచి బుద్ధి ప్రసాదించాలని కోరుతూ క్లాక్‌టవర్ వద్ద అంబేడ్కర్ విగ్రహనికి నాయకులు వినతిపత్రం అందించారు. ఎంపీపీ చంద్రమ్మ, వైస్ ఎంపీపీ నరసింహులు, పార్టీ సీనియర్ నాయకులు సింగాడి తిప్పయ్య, రాకెట్ల అశోక్, బసవరాజు మాట్లాడుతూ పుంగనూరులో రక్తపాతమే లక్ష్యంగా చంద్రబాబు తన పచ్చబ్యాచ్‌తో రాళ్లు, కర్రలు, బీరు బాటిళ్లతో దాడులకు తెగబడ్డారన్నారు. విధి నిర్వహణలో ఉన్న 27 మంది పోలీసులు, 50 మంది వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు తీవ్ర గాయాలయ్యాయన్నారు. అధికారం కోల్పోయి చంద్రబాబు, లోకేష్ నిస్సహాయ స్థితిలో ఉన్నారని, రాష్ట్రంలో అల్లర్లు, దౌర్జన్యాలు చేసి అధికారం చేజిక్కించుకోవాలని ప్రయత్నిస్తున్నారని ధ్వజమెత్తారు. చంద్రబాబు ఎన్ని డ్రామాలు చేసినా ప్రజలు టీడీపీని నమ్మరని, మరోసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని సీఎంగా చేసుకోవడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ వన్నప్ప, వక్ఫ్ బోర్డు డైరెక్టర్ మీరంబాషా, కోఆప్షన్ సభ్యులు సలీం, బళ్ళారి ఆసీఫ్, పామిడి జాకీర్, వన్నూర్‌సాబ్, ఎర్రిస్వామి రెడ్డి, వడ్డే ఆంజినేయులు తదితరులు పాల్గొన్నారు.

నేడు 'గడప గడపకూ మన ప్రభుత్వం'

గుమ్మఘట్ట: మండలంలోని సిరిగెదొడ్డి గ్రామంలో ఆదివారం ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ నరసింహమూర్తి శనివారం తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు హాజరు కావాలని ఆయన కోరారు.

సత్యసాయి పైపులైన్ లీకేజీ

కళ్యాణదుర్గం రూరల్: కళ్యాణదుర్గం – కంబదూరు ప్రధాన రహదారి పక్కన కేజీబీవీ సమీపంలో శనివారం సత్యసాయి ప్రధాన తాగునీటి పైపులైన్ లీకేజీ ఏర్పడింది. దీంతో అధిక మొత్తంలో నీరు వృథా అయ్యింది. విషయం తెలుసుకున్న సిబ్బంది హుటాహుటిన అక్కడికి చేరుకుని మరమ్మతు చర్యలు చేపట్టారు.

గుండెపోటుతో క్లర్క్ మృతి

కంబదూరు: మండల కేంద్రంలోని ప్రాథమిక సహకార సంఘం కార్యాలయంలో క్లర్క్‌గా పని చేస్తున్న అంజనప్ప(42) గుండెపోటుతో మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి..శెట్టూరు మండలం కైరేవు గ్రామానికి చెందిన అంజనప్ప సహకార సంఘంలో 15 సంవత్సరాలుగా క్లర్క్‌గా పని చేస్తున్నాడు. అంజనప్పకు శనివారం గుండెపోటు రావడంతో బంధువులు అనంతపురంలోని ఓ ఆస్పత్రికి తీసుకెళ్లారు.అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. అతడికి భార్య రామలక్ష్మి, కుమారుడు, కూతురు ఉన్నారు. అంజనప్ప మృతదేహాన్ని రాష్ట్ర జానపద, సృజనాత్మక అకాడమీ డైరెక్టర్ బాబురెడ్డి, సహకార సంఘం కార్యదర్శి ముత్యాలప్ప సందర్శించి నివాళులర్పించారు.

సాంకేతిక పద్ధతులపై రైతులకు శిక్షణ



మాట్లాడుతున్న పశు విజ్ఞాన శాస్త్రవేత్త హరిణి

కూడేరు: మండలంలోని చోళసముద్రంలో వాటర్ షెడ్ ఆధ్వర్యంలో కళ్యాణదుర్గం కృషి విజ్ఞాన కేంద్రం తరపున రైతులకు పాడి పంటలు, పశువుల యాజమాన్యంపై శనివారం మూడు రోజులు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. శాస్త్రవేత్తలు హరిణి, రాధాకుమారి మాట్లాడుతూ పాడి పశువులకు గ్రాసంతో పాటు పోషకాలతో కూడిన దాణా అందించాలన్నారు. తద్వారా పాల దిగుబడి పెంపొందుతుందన్నారు. పంటల సాగులో మెలకువలు పాటిస్తూ నూతన వ్యవసాయ సాంకేతిక పద్ధతులు అవలంభిస్తే దిగుబడి ఆశాజనకంగా ఉండి అధిక ఆదాయాన్ని పొందవచ్చన్నారు. వేరుశనగనే కాకుండా వివిధ రకాల పంటలను సాగు చేసుకోవాలన్నారు. తద్వారా ఏదో ఒక పంట ఆదుకుంటుందన్నారు. అనంతరంపంటలకు సోకే తెగుళ్లు, నివారణ చర్యలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డ్వామా ఏఓ విశ్వనాథ్‌రెడ్డి, వాటర్ షెడ్ చైర్మన్ పెన్నోబులేసు, సభ్యులు, పంచాయతీ కార్యదర్శి వెంకటనారాయణ, రైతులు పాల్గొన్నారు.

సిట్రిక్స్ బృందం సేవాగుణం



ముద్దలాపురం పాఠశాలలో కంప్యూటర్ పరికరాలు అందిస్తున్న దృశ్యం

బ్రహ్మసముద్రం: మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే విద్యార్థుల కోసం రూ.లక్షలు విలువ చేసే బోధన పరికరాలు అందించి సిట్రిక్స్ సాఫ్ట్‌వేర్ కంపెనీ ఉద్యోగులు సేవాభావం చాటుకున్నారు. మండలంలోని ముద్దలాపురం పాఠశాలలో చదువుకున్న పూర్వ విద్యార్థులు వైటీ రామాంజనేయులు ఆధ్వర్యంలో పేద విద్యార్థుల కోసం కంపెనీ ఉద్యోగులు సహకారం అందించారు. ఆ కంపెనీ బృందం శనివారం మండంలోని ముద్దలాపురం, ముప్పలకుంట, కన్నేపల్లి, గుడిపల్లి, పైదొడ్డి, కుర్లగుండ, బుడిమేపల్లి, పిల్లలపల్లి తదితర గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు లక్షలాది రూపాయలు విలువ చేసే కంప్యూటర్స్, ల్యాప్‌టాప్స్, నోట్‌బుక్స్ అందించారు. అనంతరం కంపెనీ ఉద్యోగులను ఉపాధ్యాయులు సన్మానించారు.

సంక్షిప్త సమాచారం

మధ్యాహ్న భోజనం తనిఖీ

రాయదుర్గం రూరల్: మండలంలోని వడ్రహొన్నూరు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను ఎంపీడీఓ కొండయ్య శనివారం తనిఖీ చేశారు. కార్యక్రమాల్లో వేపరాల పంచాయతీ కార్యదర్శి శ్రీదేవి, సచివాలయ సిబ్బంది, అధ్యాపకులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం పంపిణీ

విడపనకల్లు/వజ్రకరూరు: విడపనకల్లు మండలంలోని పెద్ద కొట్టాలపల్లి అంగన్‌వాడీసెంటర్‌లో వైస్ ఎంపీపీ సునీతారాణి, సర్పంచు రామాంజనేయులు శనివారం గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహార కిట్లు అందజేశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్ వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. అలాగే వజ్రకరూరు మండలంలోని పీసీ.కొత్తకోట గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం -2లో పౌష్టికాహార కిట్ల పంపిణీ కార్యక్రమం ఏర్పాటు చేశారు.వైస్ ఎంపీపీ సుంకమ్మ, ఎస్సీ సెల్ మండల ఉపాధ్యక్షుడు ప్యాపిలికిష్ట, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్యంపై జాగ్రత్తలు అవసరం

కళ్యాణదుర్గం: ఫ్లోరోసిస్‌వ్యాధి గ్రస్తులు ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలని మెడికల్ ఆఫీసర్ విజయేంద్ర సూచించారు. గరుడాపురంలో శనివారం ఎన్‌పీపీసీఎఫ్ జాతీయ ఫ్లోరోసిస్ నివారణ కార్యక్రమం నిర్వహించారు, ఎంపీపీ మారుతమ్మ, ఎంపీహెచ్‌ఈఓ వేణుగోపాల్, ఎంపీహెచ్‌ఎస్ సురేష్‌బాబు, భాగ్యలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటి స్థలాల కోసం ధర్నా

కూడేరు: మండలంలోని బ్రాహ్మణపల్లి వద్ద సర్వేనంబర్ 11లో ఉన్న భూమిలో ఇంటి స్థలాలు కేటాయించాలని శనివారం కమ్మూరు, అరవకూరు, బ్రాహ్మణపల్లి, రామచంద్రాపురం, గొటుకూరుకు చెందిన ఇల్లు లేని వారు సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శ్రీకారం

కళ్యాణదుర్గం: మండలంలోని హులికల్లు గ్రామంలో శనివారం మంత్రి ఉషశ్రీ చరణ్ ఆదేశాల మేరకు గడప గడప మన ప్రభుత్వంలో భాగంగా రూ.5 లక్షల నిధులతో సీసీ రోడ్డు పనులకు స్థానిక నాయకులు శ్రీకారం చుట్టారు. ఎంపీటీసీ హనుమంతరెడ్డి, స్థానిక నాయకుడు మల్లికార్జున పనులు ప్రారంభించారు. సీసీ రోడ్డు నిర్మాణం పూర్తయితే గ్రామస్తులకు అనుకూలంగా ఉంటుందని వారు తెలిపారు.

ఉత్తమ పీఏసీఎస్‌గా 'బెళుగుప్ప'



బెళుగుప్ప: రైతులకు అత్యుత్తమ సేవలందిస్తూ జిల్లాలోనే రెండవ ఉత్తమ వ్యవసాయ సహకార సంఘంగా ఎంపికైన బెళుగుప్ప పీఏసీఎస్‌కు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తమ సొసైటీ అవార్డు ప్రకటించింది. విజయవాడలో శుక్రవారం జరిగిన రాష్ట్ర సహకార సంఘం వజ్రోత్సవాల సందర్భంగా వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధనరెడ్డి, ఆప్కాబ్ చైర్మన్ ఝాన్సీ చేతుల మీదుగా ఉత్తమ సొసైటీ అవార్డును బెళుగుప్ప పీఏసీఎస్ అధ్యక్షుడు శివలింగప్ప అందుకున్నారు. డీసీసీబీ చైర్‌పర్సన్ ఎం.లిఖిత, పీఏసీఎస్ సీఈఓ పాండురంగ పాల్గొన్నారు.

మొక్కజొన్న తోటకు నిప్పు

బెళుగుప్ప: మండల కేంద్రంలోని రైతులు రామేశ్వర రెడ్డి, తిప్పేస్వామికి చెందిన మొక్క జొన్న తోటకు గుర్తు తెలియని వారు శుక్రవారం రాత్రి నిప్పు పెట్టడంతో డ్రిప్‌వైర్లు కాలి బూడిద అయ్యాయి. ఇటీవల మొక్కజొన్న పంట నూర్పిడి చేసి పంట వ్యర్థాలను తొలగింపు చేసేలోగానే తోటకు నిప్పు పెట్టారు. తోటలోని మూడు ఎకరాల్లో వున్న డ్రిప్ వైర్లు కాలిపోవడంతో సుమారు రూ.40 వేల నష్టం వాటిల్లింది. ఘటనపై పోలీసులు, రెవెన్యూ అధికారులకు బాధిత రైతులు శనివారం ఫిర్యాదు చేశారు.

చేనేత మహాసభ విజయవంతం చేయండి



మాట్లాడుతున్న పార్టీ చేనేత విభాగం నాయకులు

ఉరవకొండ: జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 7న నిర్వహించే మహాసభను విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ చేనేత విభాగం నేతలు కోరారు. శనివారం వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎంపీపీ చంద్రమ్మ, పార్టీ చేనేత విభాగం రాష్ట్ర నాయకుడు సాధు కుళ్లాయి స్వామి, ఎంసీ నాగభూషణం, చెంగల మహేశ్వర, కాసుల ఆంజనేయప్రసాద్, గట్టు ఎర్రిస్వామి, బీరేశివ మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ చేనేత విభాగం ఆధ్వర్యంలో ఉరవకొండలో ఈనెల 7న ఉదయం 10గంటలకు లత్తవరం రోడ్డు వద్ద ఉన్న తొగట వీర క్షత్రియ కళ్యాణ మండపంలో నిర్వహించే జాతీయ చేనేత దినోత్సవ సభకు పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వై.విశ్వేశ్వరరెడ్డి, ఎమ్మెల్సీ పోతుల సునీత, పద్మశాలి కార్పొరేషన్ జింకా విజయలక్ష్మి, మాజీ ఎంపీ బుట్టా రేణుక, ఎంపీ తలారి రంగయ్య తదితరులు హాజరవుతారన్నారు. సభకు పెద్ద ఎత్తున చేనేత కార్మికులు తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో చేనేత విభాగం నాయకులు నిమ్మల వెంకటరమణ, గిద్దలూరు బ్రహ్మయ్య, నీలూరి అమర్నాథ్ రెడ్డి, లక్కా ఎర్రిస్వామి, కొత్తపల్లి హరి, ఆంజనేయులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే పేదల సంక్షేమం



విడపనకల్లు: సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి



ఉరవకొండ: తాగునీటి ప్లాంట్ ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే విశ్వ

విడపనకల్లు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మా కుటుంబానికి పెద్ద దిక్కుగా ఉంటూ పెద్ద కొడుకుగా ఆర్థికంగా ఆదుకున్నారని ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే, ఇన్‌చార్జ్ వై.విశ్వేశ్వరరెడ్డి ఎదుట వృద్ధులు, మహిళలు సంతోషం వ్యక్తం చేశారు. శనివారం మండల కేంద్రమైన విడపనకల్లులో బిల్డింగ్ కాలనీ, బీసీ కాలనీ, ఎస్సీ కాలనీలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యేకు మహిళల నుంచి అపూర్వ ఆదరణ లభించింది సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్ర పటానికి మాజీ ఎమ్మెల్యేతో కలిసి క్షీరాభిషేకం చేశారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే ఎస్సీ, బీసీ కాలనీలో ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేశారు. ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే అన్ని వర్గాల సంక్షేమం సాధ్యమన్నారు. ప్రధానంగా పథకాల్లో మహిళలకు పెద్దపీట వేశారన్నారు. గత టీడీపీ పాలనలో కేవలం తెలుగు తమ్ముళ్లు మాత్రమే లబ్ధి పొందారని గుర్తుచేశారు. ప్రస్తుతం సీఎం జగన్ ప్రజలకు మేలు చేస్తున్నా, విమర్శలు చేస్తున్న చంద్రబాబుకు వచ్చే ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలన్నారు.జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి సీఎంగా ఆశ్వీరదించాలని ప్రతి గడపలో ఆయన కోరారు.కార్యక్రమంలో ఎంపీపీ కరణం పుష్పావతి, జెడ్పీటీసీ హనుమంతు, వైస్ ఎంపీపీ మోదుపల్లి సునీతారాణి, జేసీఎస్ మండల కన్వీనర్ భరత్‌రెడ్డి, ఎస్సీసెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి సుంకన్న, పేరెంట్స్ కమిటీ చైర్మన్ గిరిబాబు, రాష్ట్ర ప్రచార కార్యదర్శి గోపాలకృష్ణ, జెడ్పీ మాజీ సభ్యుడు సింగాడి తిప్పయ్య, సచివాలయ కన్వీనర్లు దేశాయ్ సిద్ధార్థ, దేశాయ్ మున్నా, సర్పంచు మోదుపల్లి రామాంజనేయులు, ఉలిగన్న, నాగరాజు, యువరాజు, పెద్ద భీమలింగ, బెస్త ఎర్రిస్వామి, కో–ఆప్షన్ సభ్యుడు లతీఫ్, మార్కెట్ యార్డు డైరెక్టర్ రమేష్, ఎంపీడీఓ శ్రీనివాసులు, తహసీల్దారు ఈరమ్మ తదితరులు పాల్గొన్నారు.

పేక్లానుపల్లి తండాలో తాగునీటి ప్లాంట్ ప్రారంభం

ఉరవకొండ: పేక్లానుపల్లి తండా ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు తాగునీటి ప్లాంట్‌ను ఏర్పాటు చేశామని మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి తెలిపారు. శనివారం మండలంలోని పేక్లానుపల్లి తండాలో గడప గడపకూ మన ప్రభుత్వం నిధులు, మండల ప్రజాపరిషత్ ద్వారా రూ.5 లక్షల వ్యయంతో తాగునీటి శుద్ధ జల ప్లాంట్ ఏర్పాటు చేశారు. ఎంపీపీ చంద్రమ్మ, వైస్ ఎంపీపీ నరసింహులు, జెడ్పీటీసీ పార్వతమ్మ, పెన్నహోబిలం మాజీ చైర్మన్ అశోక్‌తో కలిసి ప్లాంట్‌ను మాజీ ఎమ్మెల్యే ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఇచ్చిన మాట ప్రకారం తండాలో తాగునీటి ప్లాంట్ ఏర్పాటు చేశామన్నారు. తండాలో రోడ్లు, డ్రైనేజీలతో పాటు మౌలిక వసతులు కల్పించామన్నారు. కార్యక్రమంలో నాయకులు రామచంద్ర నాయక్, వెంకటేష్, ఉపసర్పంచ్ రమేష్‌నాయక్, గుర్రం శ్రీనివాసులు, సర్పంచ్ పల్లి లింగన్న, నాగభూషణం, ఎంపీటీసీ రామలింగ, జెడ్పీ మాజీ సభ్యుడు తిప్పయ్య, ఎర్రిస్వామిరెడ్డి, ఉలిగన్న, వడ్డే ఆంజినేయులు తదితరులు పాల్గొన్నారు.

'జగనన్న సురక్ష' విజయవంతం

వజ్రకరూరు: ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేసిన జగనన్న సురక్ష కార్యక్రమం మండలంలో విజయవంతమైనట్లు వైఎస్సార్‌సీపీ రైతువిభాగం రాష్ట్ర కార్యదర్శి క మలపాడు వెంకటరెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఎఫ్‌పీఓ చైర్మెన్ అమర్‌నాథ్, తట్రకల్లు ఎంపీటీసీ రామక్రిష్ణ, బీసీ సెల్ కార్యదర్శి వీరభద్రగౌడ్, సీనియర్ నాయకుడు కిష్టన్న తదితరులతో కలిసి ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మండల వ్యాప్తంగా జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా 7,150 సర్టిఫికెట్లు అందజేశామన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనపై అన్ని వర్గాల ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారన్నారు.

హెచ్చెల్సీలో పూడికతీత



గాజుల మల్లాపురం వద్ద కెనాల్‌లో జేసీబీ సాయంతో పూడికతీత చేపట్టిన రైతులు

విడపనకల్లు: మండలంలోని హెచ్చెల్సీ 9వ డిస్ట్రిబ్యూటరీ కెనాల్‌లో శనివారం ఎంపీటీసీ దాసరి వెంకటేశులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, రైతులు కలసి జేసీబీతో పూడికతీత పనులు చేపట్టారు.హెచ్చెల్సీ మెయిన్ కెనాల్‌కు సాగునీరు రావడంతో ఆయకట్టుకు సాగునీరు సులువుగా పారేందుకు నాలుగు జేసీబీలతో కెనాల్‌లో ముళ్లపొదల తొలగింపు, పూడికతీత పనుల చేయించారు. 9వ డిస్ట్రిబ్యూటరీ కింద దాదాపు 6 వేలు ఎకరాలు ఆయకట్టు ఉన్నట్లు రైతులు తెలిపారు.

లైన్‌మెన్ సస్పెన్షన్

కణేకల్లు: మండలంలోని బెణికల్లులో ఓ ప్రైవేట్ వ్యక్తి అనధికారికంగా తలపెట్టిన విద్యుత్ లైన్ షిఫ్టింగ్‌కు సహకరించిన లైన్‌మెన్‌ను సస్పెండ్ చేస్తూ ఆ శాఖ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు కళ్యాణదుర్గం డివిజన్ ఈఈ శేషాద్రినాయుడు తెలిపారు. వివరాలు.. బెణికల్లు గ్రామంలో ఇళ్ల మీదుగా ఉన్న విద్యుత్ లైన్‌ను మార్చేందుకు స్థానికులతో ఓ ప్రైవేట్ వ్యక్తి ఒప్పందం చేసుకున్నాడు. ఈ క్రమంలో కణేకల్లు విద్యుత్ సబ్ స్టేషన్‌లో షిఫ్ట్ ఆపరేటర్‌గా పనిచేస్తున్న లైన్‌మెన్ రామాంజినేయులు సాయం తీసుకున్నాడు. అయితే బెణికల్లు విద్యుత్ లైన్ బ్రహ్మసముద్రం గ్రామంలోని సబ్ స్టేషన్ పరిధిలోకి వస్తుండడంతో గత ఆదివారం అక్కడి పనిచేస్తున్న ఆపరేటర్ రాముకు రామాంజినేయులు ఫోన్ చేసి అనధికారికంగా ఎల్‌సీ ఇప్పించాడు. ఇందుకు పోల్ టూ పోల్ వర్కర్ రవి కూడా సహకరించాడు. ఈ విషయం ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లడంతో విచరణ చేపట్టి, వాస్తవాలు నిగ్గుతేల్చారు. ప్రైవేట్ పనులకు అనధికారికంగా ఎల్‌సీ ఇచ్చినట్లుగా నిర్ధారణ కావడంతో రామాంజినేయులను సస్పెండ్ చేశారు. ఇందుకు సహకరించిన కాంట్రాక్ట్ ఉద్యోగులు రాము, రవిను ఉద్యోగం నుంచి తొలగించాలంటూ సంబంధిత ఏజెన్సీకి సిఫారసు చేశారు. కాగా, బెణికల్లులో ఇళ్ల మీదుగా వెళ్లిన విద్యుత్ లైన్ షిఫ్టింగ్ పనులను శాఖాపరంగా చేయిస్తామని ఈఈ శేషాద్రి నాయుడు స్పష్టం చేశారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా పనులు పూర్తి చేస్తామని భరోసానిచ్చారు.

సామాజిక తనిఖీలో పారదర్శకత పాటించండి



మాట్లాడుతున్న డీవీఓ రమణారెడ్డి

శెట్టూరు: మండలంలో నిర్వహించనున్న సామాజిక తనిఖీలో పారదర్శకత పాటించాలని జిల్లా విజిలెన్స్ అధికారి రమణారెడ్డి సూచించారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో కోఆర్డినేషన్ మీటింగ్ నిర్వహించారు. ఉపాధి పథకానికి సంబంధించి 16వ విడత 2022–2023 ఆర్థిక సంవత్సరంలో 16 గ్రామ పంచాయతీలు కలిపి రూ.11 కోట్లు ఖర్చు చేయగా.. ఆ పనులను సామాజిక తనిఖీ చేపడతామన్నారు. ఆడిట్ నిర్వహించే సమయంలో ఫీల్డ్ అసిస్టెంట్, టెక్నికల్ అసిస్టెంట్లు సంబంధిత అధికారులు అందుబాటులో ఉండాలన్నారు. గ్రామసభల నిర్వహణ సమయంలో స్థానిక పంచాయతీ కార్యదర్శులు హాజరు కావాలన్నారు. కార్యక్రమంలో సోషల్ అడిట్ ఎస్‌ఆర్పీ లోకేష్, తులసి నాయక్ , ఏపీఓ రమేష్ , డీఆర్పీలు రాజేష్, పవన్, పంచాయతీ కార్యదర్శులు ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

నులిపురుగుల నివారణతో ఆరోగ్యం

గుమ్మఘట్ట/కూడేరు/వజ్రకరూరు: ఈ నెల 10న జాతీయ నులిపురుగుల దినోత్సవాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీఓ నరసింహమూర్తి, పీహెచ్‌సీ వైద్యులు రమేష్ తెలిపారు. గుమ్మఘట్ట మండలపరిషత్ కార్యాలయంలో టాస్క్‌ఫోర్స్ కమిటీ సమీక్ష సమావేశాన్ని శనివారం నిర్వహించారు. వారు మాట్లాడుతూ 1 నుంచి 19 సంవత్సరాల పిల్లలకు నులిపురుగుల నివారణకు ఆల్‌బెండజోల్ మాత్రలు వేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓ రామచంద్ర, సీహెచ్‌ఓ మురళీధర్, సూపర్‌వైజర్లు ఆదిబయమ్మ, జయమ్మ తదితరులు పాల్గొన్నారు. అలాగే కూడేరు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ ఎంకే బాషా నులిపురుగుల నివారణ దినోత్సవానికి సంబంధించిన పోస్టర్లు విడదల చేశారు. అనంతరం సిబ్బందికి ఆల్‌బెండజోల్ మెటీరియల్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఈఓలు చంద్రశేఖర్, సాయికృష్ణ, సీహెచ్‌ఓలు మోహన్‌బాబు, వరలక్ష్మి, వైద్య, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు రవీంద్ర, అరుణ తదితరులు పాల్గొన్నారు. వజ్రకరూరు ఎంపీడీఓ కార్యాలయంలో నేషనల్ డీవార్మింగ్ డే కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను అధికారులు విడుదల చేశారు. ఎంపీడీఓ విజయలలిత, వైద్యాధికారులు సర్దార్‌వలి, పద్మ, ఎంఈఓ ఎర్రిస్వామి, హెల్త్ ఎడ్యుకేటర్ సత్య నారాయణ, ఎంపీహెచ్‌ఈఓ గురుప్రసాద్ పాల్గొన్నారు.

సబ్సిడీ స్ప్రేయర్ల పంపిణీ

రాయదుర్గం రూరల్: మండలంలోని వాటర్‌షెడ్ గ్రామం టి.వీరాపురం రైతులకు జిల్లా నీటి యాజమాన్య సంస్థ ఆధ్వర్యంలో ప్రధానమంత్రి కృషి సంచాయ్ యోజన పథకం ద్వారా జెడ్పీటీసీ మల్లికార్జున శనివారం సబ్సిడీ ధరతో అందించే తైవాన్ స్ప్రేయర్లు, టార్పాలిన్లు, పైపులు అందజేశారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ ఆఫీసర్ శ్రీవిద్య, టీఓ ఈరన్న, మహేష్ , రామకృష్ణారెడ్డి, సుధాకర్, చిత్రయ్య పాల్గొన్నారు.